


# తెర

**నందం రామారావు**

ఆ వేళ—

ముకుందం గదిలో దిగులుగా కూర్చున్నాడు.

మనసంతా అదోలా వుంది. జరిగిన వాటి గురించి నిజం తెలుసుకోవాలనే ఉద్దేశం అతని కోపం మింగేసింది!

ఇప్పుడు తను యేడుస్తున్నాడు.

అవును! అతను పుట్టినప్పటి నుండీ చాలా సార్లు యేడ్చేడు. నాన్న చనిపోయినప్పుడు యేడ్చాడు. అమ్మ చనిపోయినప్పుడేడ్చాడు. ఇప్పుడూ యేడుస్తున్నాడు!

ఆ సమయంలో అతని విచారాన్ని దూరంగా నెట్టివేయడానికి దేవుడిలా శంకరం వచ్చాడు. ముకుందం వాలకం చూసి, "మంచి బుద్ధిమంతుడివిరా. సమయం కాని సమయంలో గదిలో కూర్చుని పుట్టెడు దుఃఖాన్ని నెత్తినేసుకోవడం మంచిదంటావా? దటీజ్ టూ బేడ్. రా వెడదాం. హాయిగా కలల్లో తేలిపోదాం" అన్నాడు.

"ఇప్పుడు నేనెక్కడికీ రాలేను."

"అలా అంటే సరిపోతుందనుకుంటున్నావా? అనుభవించడానికున్న హంగులన్నీ వదులుకుని రోగిలా వుండడం ఏమిట్రా ఇది? రా చిట్టీ, వెడదాం. నీ స్థితిలో నేనుంటే ఏం చేసేవాడినో తెలుసా? జామ్మంటూ ఓ అందమైన అప్సరని పక్కనేసుకుని కులాసాగా తిరిగేవాడిని. ఉద్యోగానికి రిజైన్ చేసేవాడిని. అస్సలు ఉద్యోగం చేయవలసిన ఖర్మ నీకేం పట్టింది? తరగని ఆస్తి. అదృష్టవంతుడివిరా!"

"శంకరం! నా మనసేం బావుండలేదురా. ఈ రోజంతా ఈ గదిలోనే గడిపేస్తాను. నాతో నువ్వూ ఉండు. నీకో చక్కటి కథ చెప్తాను."

"కథలు చెప్పేంతవరకూ ఎదిగావన్న మాట. గుడ్! లైఫ్‌లో ఫేలవడమంటూ వుండదు. నువ్వు చాలా ఎదిగిపోయావురా. చెప్పు చెప్పు. కథలంటే నాకు చాలా ఇంటరెస్ట్."

శంకరం కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్టు వెలిగించాడు. ముకుందానికొకటిచ్చాడు. అతను సిగరెట్టు వెలిగించి—

"ఈ కథలో పాత్రను నేను కాను. నా ఫ్రెండ్ రెడ్డి అతనీ కథ. ఈ కథ ఓ అందమైన ఆడకూతురు చుట్టూ తిరిగింది. ఆ తర్వాత..."

"వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వాళ్ల తల్లి దండ్రులు వొప్పుకోలేదు.. ఇదేగా...?"

"కాదు."

"వాళ్లు ప్రేమించుకోలేదా?"

"ప్రేమించుకున్నారు."

"మరి... ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందా?" విసుగ్గా అన్నాడు శంకరం.

"ఇదేం కాదు!" ముకుందం అరిచాడు.

శంకరం ఆశ్చర్యపోయి, కుర్చీ ముందుకు జరుపుకుని అన్నాడు— "చూడు బ్రదర్! ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మకూడదు! నమ్మకూడదు అన్న ఈ డైలాగ్ వుంది చూశావ్. ఇది శాశ్వతం. ప్రపంచం వున్నంత కాలం ఇది వుంటుంది. అంచేత, ఆఫ్టరాల్ ఎవరో అప్పుల నర్సమ్మ కోసం దిగులు పడటం వొంటికి మంచిది కాదు. ఏమంటావ్?"

"శంకరం! అనవసరంగా నువ్వేదో వాగేస్తున్నావ్."

"ఏమిటీ సస్పెన్స్?" శంకరం కుర్చీ లోంచి లేచాడు.

ముకుందం, అతని చేతులు పట్టుకుని ఆపి అన్నాడు—"నెల రోజుల్లో ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్న రెడ్డి, ఒకానొక రాత్రి రెడ్డి సెకండ్ షో సినిమాకెళ్లి వస్తుండగా, రోడ్డు పక్కగా నడుచుకుంటూ, ముచ్చటగా మాట్లాడుకుంటున్న జంటను చూసి, ఆశ్చర్యపోయాడు. రెడ్డిక్కాబోయే భార్య పరాయి మగాడితో.. ఆ వ్యక్తి ఎవరో రెడ్డికి తెలీదు. అరుణను అడిగి తెలుసుకుందామనుకున్నాడు..."

" 'నువ్వు నన్ను మోసం చేయడానికి ఆడుతున్న నాటకం.

నువ్వింత సంకుచితత్వంలో బతుకుతున్నావా? నువ్వొట్టి అనుమానపు 'మనిషివి. నీకు మనుషులు అర్థం కారు...' అరుణ ఇలా అంటుందని అడుగలేకపోయాడు రెడ్డి. అవునంటావా?" శంకరం కోపం దిగమింగి అన్నాడు.

"రెడ్డి అనుమానాన్ని పెంచుకున్నాడే గానీ నిజం తెలుసుకోలేకపోయాడు. అరుణ, ఆ మరుసటి రోజు రెడ్డిని కలిసి కూడా ఆ విషయం ప్రస్తావించలేదు. అపోహతో అరుణను అడగలేక, మనసుని సరిపెట్టుకోలేక రెడ్డి పారిపోయాడు. అది పిరికితనం కాదు. రెడ్డి, అరుణపై తను పెంచుకున్న నమ్మకం మసైందని కలవరపాటు చెందాడు. ఆరాటపడ్డాడు. కుళ్ళి కుళ్లి యేడ్చాడు. అందుకే, ఆమెకు కనిపించకుండా పారిపోయాడు.

"ముకుందం! ఇది జాలి కథ కాదు. ఆఫ్‌కోర్సు, రెడ్డి నీ ఫ్రెండే కావచ్చు. అతని చర్యను నేను సమర్థించలేను. అనుమానమున్నప్పుడు, అరుణ సినిమాకు ఎవరితో వెళ్లిందో తెలుసుకోకపోవడం పెద్ద తప్పు. అవునంటావా?"

ముకుందం రెండు నిముషాలు మౌనంగా ఉండి అన్నాడు—"రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత రెడ్డి, అరుణను కలుసుకున్నాడు."


"ఏం జరిగింది?"

"రెడ్డి ఇదివరకటిలా మాట్లాడాలని ప్రయత్నించాడు. ఆమె అందుకు అవకాశం ఇవ్వలేదు."

"ముకుందం, నీ ఫ్రెండ్ కావాలని చేసుకున్న అపరాధానికి మనం జాలి చూపించొద్దు. అది అతని తప్పు. అంచేత దాన్ని గురించి ఆలోచించమాకు. ఆమె మీద మనసుండి ఆమెను చేసుకోవాలనుకుంటే ధైర్యం వుండి ఆమెతో నిజం చెప్పమను. వారం రోజుల్లో వాళ్లిద్దరూ భార్యాభర్తలవుతారు."

"థాంక్స్ శంకరం. మంచి సలహా ఇచ్చావ్. వాడు నీ పేరు చెప్పుకుని పచ్చగా వుంటాడు. నీ మేలు మరచిపోలేడు" ముకుందం సంతోషంగా అన్నాడు.

"అవునూ! నీ ఫ్రెండ్ రెడ్డేదో పుట్టెడు దుఃఖంలో వుంటే, నువ్వెందుకీ ఏడ్పుమొహం?" ముకుందం మాట్లాడలేదు.



"మాట్లాడవేంరా?"

"క్షమించరా శంకరం! రెడ్డి ఎవరో నాకు తెలీదు. ఈ కథలో రెడ్డి పాత్ర నాది."

శంకరం ఆశ్చర్యంగా ముకుందాన్ని చూస్తుండిపోయాడు!

** ** **

శంకరం వెళ్లిపోయిన తర్వాత ముకుందం పడుకున్నాడు. అతనికి నిద్ర రావడం లేదు. గదిలో లైటు మసగ్గా వుంది. అతని మనసులో అరుణ నిండుగా ఉంది. నిన్న జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది—

మచిలీపట్నంలో పార్కు చాలా అందంగా ఉంది. ఇటీవల కాలంలో మెయిన్ రోడ్‌లో వున్న ఆ పార్కును చాలా చాలా అందంగా తీర్చిదిద్దారు. గతంలో ఈ పార్కు కళావిహీనంగా ఉండేది. పార్కులా అనిపించేదికాదు. అటువంటిదిప్పుడు కళ కళలాడుతోంది. మునిసిపాలిటీ లక్షలు వెచ్చించి పార్కును చూడముచ్చటగా తీర్చి దిద్దింది. ఇప్పుడు ఈ పార్కు సాయంత్రమయ్యేసరికి జనంతో నిండిపోతోంది. పెద్దలు, పిన్నలు, జంటలు, పిల్లలతో ఆహ్లాదంగా వుంది. అదిగో... అటువంటి సమయంలో ముకుందం ఏం తోచక పార్కుకొచ్చాడు. ఒక మూలగా పచ్చని గడ్డిలో కూర్చుని వున్న అరుణను చూసి ముకుందం ఆశ్చర్యపోయాడు. గబగబా ఆమె దగ్గరకెళ్లాడు.

"అరుణా! నువ్విక్కడ బందరులో... ఈ వూరెప్పుడొచ్చావ్?" అన్నాడు.

"చాలా రోజులైంది. నేనిక్కడ ఉద్యోగం చేసుకుంటున్నాను."

"నిజమా?"

"అవును!'

"నిన్నక్కడ చూడ్డం చాలా సంతోషంగా ఉంది."

అరుణ మాట్లాడలేదు.

"అరుణా! నీ కోసం, నువ్వెక్కడున్నావో చాలా ప్రయత్నాలు చేశాను. నీ జాడ తెలియలేదు. ఇక్కడవుండి కూడా నిన్ను చూడలేకపోయాను."

ఆమె పక్కన కూర్చున్నాడు ముకుందం. అరుణ అవతలకు జరిగింది. గడ్డి పరకల్ని తుంచుతూ—"ఇప్పుడవన్నీ అనవసరం. వాటిని గురించి మాట్లాడుకోవడం మంచిది కాదు" అంది.

"అలా అనకు అరుణా! నేను నీ సాహచర్యం కోసం, నిన్ను నా దాన్ని చేసుకోవాలనుకోవడం.. అవన్నీ నీకు తెలుసు..."

"తెలుసు. తెలుసు గనుకనే ఇలా మాట్లాడగలుగుతున్నాను. ఇప్పుడు నేను గౌరవంగా ఉద్యోగం చేసుకుంటూ సుఖంగా బతుకుతున్న ఆడకూతుర్ని. మళ్లీ నా మనసులో ప్రవేశించి నన్ను గందరగోళపరచకు. ప్లీజ్. ముకుందం, వెళ్లిపో ఇక్కడ నుండి!"

"అదేనా మన అనుబంధం?"

"అనుబంధానికి అర్థం తెలిస్తే ఆ రోజు నువ్వలా ప్రవర్తించేవాడివేనా?"

"ఎందుకలా ప్రవర్తించానో అర్థం చేసుకోగలిగావా?"

"లేదు. దానికి సమాధానం చెప్పవలసింది నువ్వు!" కటువుగా అంది అరుణ.

**(మిగతా వచ్చే వారం)**